
సాక్షి అనంతపురం

శుక్రవారం । 14 । మార్చి । 2025



టన్ను చీనీ రూ.25,630

అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.25,630 ప్రకారం విక్రయాలు జరిగాయి.



కిలో టమాట రూ.8

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.8, కనిష్టంగా 5, సరాసరిన రూ.7 ప్రకారం ధర పలికింది.



న్యూస్‌రీల్

కంబదూరులో చిరుతల హల్‌చల్



కొండపై సంచరిస్తున్న చిరుతలు

కంబదూరు: మండల కేంద్రంలోని సిద్దుల కొండ సమీపంలో గురువారం చిరుతలు హల్‌చల్ చేశాయి. కొండ సమీపంలో ఉన్న తమ వ్యవసాయ పొలాలకు వెళ్లిన రైతులకు కనిపించాయి. దీంతో భయాందోళన చెందిన రైతులు పారిపోయేందుకు యత్నించారు. ఈ క్రమంలోనే పెద్దోడు అనే రైతు వాటి దాడి నుంచి త్రుటిలో తప్పించుకున్నాడు. గత కొన్ని రోజులుగా మండల కేంద్రంలోని పలు ప్రాంతాల్లో చిరుతలు సంచరిస్తున్నాయని రైతులు తెలిపారు.

గుడ్డు.. వెరీ బ్యాడు!



ఉడకబెట్టిన గుడ్లు నల్లగా మారిన దృశ్యం

కూడేరు: ప్రభుత్వ పాఠశాలలకు నాసిరకం కోడి గుడ్లు సరఫరా చేస్తున్నారు. వాటిని పిల్లలు తిన లేక పారేస్తున్నారు. గురువారం కూడేరు మండల పరిధిలోని ఎంఎంహళ్లి ప్రాథమిక పాఠశాలలో ఉడకబెట్టిన కోడి గుడ్లు కుళ్లిపో యాయి. తెల్లటి సొన నల్లగా మారింది. మండలంలోని పాఠశాలలకు కొన్ని రోజులుగా ఏజెన్సీ నిర్వాహకులు నాసిరకం కోడి గుడ్లు సరఫరా చేస్తున్నారు. దీంతో పిల్లలు వాటిని తినకుండా పారేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

చిక్కీలో పురుగులు.. అధికారుల పరుగులు!

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని కస్తూరిబా బాలికల నగరపాలక ఉన్నత పాఠశాలకు సరఫరా చేసిన చిక్కీల్లో పురుగులున్నాయంటూ గుర్తు తెలియని వ్యక్తి నేరుగా సమగ్రశిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు మొబైల్‌కు ఓ వీడియో పంపడం కలకలం రేపింది. ఆయన వెంటనే పాఠశాల విద్య ఆర్జేడీ శామ్యూల్‌కు దాన్ని పంపి విచారణకు ఆదేశించారు. గురువారం జిల్లా పర్యటనలో ఉన్న ఆర్జేడీ...మధ్యాహ్నం ఉరుకులు, పరుగుల మీద పాతూరులోని కస్తూరిబా బాలికల పాఠశాలకు వెళ్లారు. ఆయనతో పాటు డీఈఓ ప్రసాద్‌బాబు, డీవైఈఓ శ్రీనివాసరావు, విద్యాశాఖ ఏడీ కృష్ణయ్య, తమ సిబ్బందితో వెళ్లారు. ఒకేమారు ఇంతమంది అధికారులు రావడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు ఆందోళన చెందారు. కోడిగుడ్లు, చిక్కీలు ఉంచిన గది తాళాలు తెప్పించి చిక్కీల ప్యాకెట్లన్నీ పరిశీలించారు. ఫిబ్రవరి 17వ తేదీ, ఈనెల 4వ తేదీతో ముద్రించిన చిక్కీలను గుర్తించారు. వాట న్నింటినీ పాకెట్లు తీసేసి ఒక్కొక్కటీ క్షుణ్ణంగా పరిశీలించారు. ఏ ఒక్క చిక్కీలోనూ పురుగులు కనిపించలేదు. ఆర్జేడీ, డీఈఓ అక్కడి నుంచి వెళ్లిపోయినా డీవైఈఓ, ఏడీ రెండుగంటలకు పైగా పరిశీలించారు. ఈ మొత్తం వ్యవహారమంతా వీడియో రికార్డ్ చేశారు. చివరకు ఎస్పీడీ నుంచి వచ్చిన వీడియో ఇక్కడికి సంబంధించినది కాదని తేల్చారు. విషయాలన్నింటిపై ఎస్పీడీకి నివేదిక పంపుతున్నామని డీఈఓ తెలిపారు.

- నెలరోజుల క్రితం అనంతపురం సాయినగర్‌లో ఆయుర్వేద డాక్టర్ ఒకరు అల్లోపతి మందులు అమ్ముతూ విజిలెన్స్ తనిఖీల్లో దొరికారు. ఏళ్ల తరబడి ఆయన ఈ పని చేస్తున్నట్లు వెల్లడైంది.
- అనంతపురం సుభాష్ రోడ్డులో ఉన్న కొన్ని బడా మెడికల్ షాపుల్లో ప్రిస్కిప్షన్లు లేకుండానే మందులు అమ్ముతున్నారు. రోజూ వేల మందికి మాత్రలు కట్టబెట్టేస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఆ షాపులవైపు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు కన్నెత్తి చూసిన పరిస్థితి లేదు.
- ఇటీవల రాయదుర్గం నియోజకవర్గంలో ఓ ఆర్‌ఎంపీతో చికిత్స చేయించుకున్న వ్యక్తి మృతి చెందాడు. సదరు ఆర్‌ఎంపీ ప్రమాదకర మందులు వినియోగించడం వల్లే రోగి పరిస్థితి విషమించినట్లు వెల్లడైంది... ఇవొక్కటే కాదు.. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా మందుల షాపుల నిర్వాహకులు, ఆర్‌ఎంపీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా పట్టించుకునే నాథుడే కానరావడం లేదు.



మామూళ్ల మత్తు.. సామాన్యుల చిత్తు

ఏ 'మాత్రమూ' తనిఖీల్లేవ్

- మందుల షాపుల నిర్వాహకుల ఇష్టారాజ్యం
- ఏవి అమ్మినా.. ఎలా అమ్మినా అడిగే నాథుడే లేరు
- నార్కొటిక్స్ మందులూ విచ్చలవిడిగా విక్రయం
- మామూళ్ల మత్తులో డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు
- జిల్లాలో నీరుగారిపోయిన ఔషధ నియంత్రణ శాఖ

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి జిల్లాలో ఔషధ నియంత్రణ వ్యవస్థ నీరుగారిపోయిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నకిలీ మందులతో రోగులకు హాని జరగకుండా చూడాల్సిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు నెలవారీ మామూళ్లతో తనిఖీలే మరచిపోయారు. ఏ మందుల షాపులో ఎలాంటి మందులు అమ్ముతున్నా అడిగే వారు లేరు. నాసిరకం మందులతో సామాన్యుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నా పట్టించుకునే దిక్కు లేదు. కొత్త లైసెన్సు కావాలంటే డబ్బు, ఫార్మసిస్ట్ లేకుండా అమ్ముతుంటే డబ్బు, ప్రిస్కిప్షన్ లేకుండా అమ్ముతుంటే తనిఖీ చేయకపోవడానికి డబ్బు.. ఇలా ఒకటేమిటి ఉమ్మడి అనంతపురం జిల్లాలో డ్రగ్ అధికారులు పూర్తిగా మామూళ్ల మత్తులో జోగుతున్నారు.

నిబంధనలు తుంగలోకి..

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా దాదాపు 2,150 వరకూ హోల్‌సేల్, రీటెయిల్ మందుల షాపులున్నాయి. వీటిల్లో ఎక్కడా ప్రభుత్వ నిబంధనలన్నీ అమలు కావడం లేదు. మండలస్థాయిలో ఉన్న షాపులు ఆరు మాసాలకు రూ.3 వేలు, అదే అర్బన్‌లో అయితే ఆరుమాసాలకు రూ.5,500 లెక్కన ముట్టజెబుతున్నట్లు తెలిసింది. ఇప్పుడు తాజాగా ఆ శాఖ ఏడీకి సెపరేటు కమీషన్ ఉన్నట్లు సమాచారం. ఏడాదిలో కనీసం రూ.2 కోట్ల వరకూ మెడికల్ షాపుల నుంచి డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు, ఏడీలకు వెళుతున్నట్టు అంచనా. ఇందులోనే పై అధికారులకూ ఇస్తామని షాపుల యజమానులతో చెబుతున్నట్టు తెలిసింది. ఈ స్థాయిలో వసూళ్లు చేస్తున్నప్పుడు తనిఖీలు ఎలా చేస్తారన్నది అంతుచిక్కని ప్రశ్నగా మారింది.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో

మందుల షాపులు	2,200
హోల్‌సేల్ మందుల షాపులు	52
మందులు వినియోగిస్తున్న వారి సంఖ్య	25 లక్షలు
డాక్టరు చిట్టీ లేకుండా మందులు తెచ్చుకుంటున్న వారు	10 లక్షలు
ఏడాదిలో యాంటి బయోటిక్స్ అమ్మకాలు ఒక్కటే	రూ.250 కోట్లు

ఈ నిబంధనలు తప్పనిసరి..

- ప్రతి మందుల షాపులోనూ సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఉండాలి.
- మందులు అమ్మిన ప్రతి బిల్లులోనూ పేషెంటు వివరాలు నమోదు చేయాలి.
- బిల్లులో మొబైల్ నంబరు కచ్చితంగా ఉండాలి.
- ప్రిస్కిప్షన్ లేకుండా మందులు అమ్మకూడదు.
- ఎన్‌ఆర్‌ఎక్స్ అంటే నార్కొటిక్ మందులు ఎట్టి పరిస్థితుల్లో అమ్మరాదు.
- షెడ్యూల్ బుక్ విధిగా నిర్వహించాలి.
- రెస్టిల్, ఆల్‌ప్రాక్స్, యాంక్సిట్, డైజోపాం, లోరాజెపామ్, క్లోనాజెపాం, కోడెయిన్ వంటి మందులు ఇవ్వకూడదు.

ఫిర్యాదులొచ్చాయి..

ఔషధ నియంత్రణ శాఖపై ఫిర్యాదులొచ్చిన మాట వాస్తవమే. ఈ విభాగాన్ని పూర్తిగా గాడిన పెట్టాల్సిన అవసరం ఉంది. ఆ మేరకు చర్యలు చేపట్టాం. వసూళ్లకు పాల్పడిన వారు ఎవరైనా సరే చర్యలు తీసుకుంటాం. –వినోద్ కుమార్, కలెక్టర్

పది పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఆర్జేడీ శామ్యూల్

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని పాఠశాల విద్య రీజినల్ జాయింట్ డైరెక్టర్ శామ్యూల్ ఆదేశించారు. ఈనెల 17 నుంచి ప్రారంభం కానున్న పరీక్షల నిర్వహణపై గురువారం జిల్లాలోని చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులతో స్థానిక ఎస్‌ఎస్‌బీఎన్ కళాశాలలో సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన శామ్యూల్ మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ కాపీయింగ్‌కు అవకాశం ఇవ్వొద్దన్నారు. తప్పులు లేని సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులే కీలకమని, ఎవరూ స్వల్పకాలిక ప్రయోజనాలకు ఆశ పడొద్దని హితవు పలికారు. సమావేశంలో డీఈఓ ప్రసాద్‌బాబు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ పాల్గొన్నారు.

గంట ఆలస్యంగా సమావేశం

మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం ఉంటుందని చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులకు సమాచారం అందించారు. వారంతా 1.30 గంటలకే చేరుకున్నారు. అయితే 3 గంటల తర్వాత సమావేశం ప్రారంభం కావడంతో ఉసూరుమన్నారు. జిల్లా సరిహద్దు మండలాల స్కూళ్ల నుంచి ఉదయం బయలుదేరి వచ్చామని, ఇంత ఆలస్యంగా ప్రారంభమైతే తాము తిరిగి ఊళ్లకు ఎలా వెళ్లాలంటూ వాపోయారు.

కోడింగ్‌లో పొరబాట్లకు తావివ్వొద్దు

పదో తరగతి జవాబు పత్రాల కోడింగ్‌లో పొరబాటుకు తావివ్వొద్దని పాఠశాల విద్య రీజినల్ జాయింట్ డైరెక్టర్ శామ్యూల్ సూచించారు. అనంతపురంలోని సైన్స్ కేంద్రంలో రాయలసీమ జిల్లాల్లోని కోడింగ్, అసిస్టెంట్ కోడింగ్ ఆఫీసర్లతో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఆర్జేడీ మాట్లాడుతూ ఏ ఒక్క విద్యార్థికీ అన్యాయం జరగకూడదన్నారు రెగ్యులర్ పరీక్షలతో పాటు ఓపెన్ పరీక్షలకు కూడా ఇదే విధంగా వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో అనంతపురం, అన్నమయ్య, కర్నూలు, వైఎస్సార్ జిల్లాల డీఈఓలు తదితరులు పాల్గొన్నారు.

మొల్లమాంబ మహోన్నతురాలు

- కలెక్టర్ వినోద్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ



మొల్లమాంబ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న తదితరులు

అనంతపురం అర్బన్: మొల్లమాంబ మహోన్నతురాలని కలెక్టర్ వినోద్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ కొనియాడారు. గురువారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మొల్లమాంబ జయంత్యుత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్‌తో పాటు అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న ముఖ్యఅతిథులుగా హాజరై మొల్లమాంబ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ మొల్లమాంబ రాయలసీమలో జన్మించడం గర్వకారణమన్నారు. వాల్మీకి రామాయణం సామాన్యులకు అర్థమయ్యేలా తెలుగులో రచించారని, ఆమె రాసిన రామాయణం మొల్ల రామాయణంగా ప్రసిద్ధి గాంచిందన్నారు. మొల్లమాంబ చరిత్రను భావితరాలకు అందించేందుకు అందరూ కృషి చేయాలన్నారు. కుమ్మరుల సమస్యలను సంఘం నాయకులు, కులపెద్దలు తన దృష్టికి తీసుకొచ్చారని, వారి అభ్యున్నతికి సంపూర్ణంగా కృషి చేస్తానని కలెక్టర్ చెప్పారు. అనంతరం బాలికల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీఆర్‌ఓ ఎ.మలోల, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ రాధిక, కుమ్మర శాలివాహన రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కుమ్మర ఓబుళపతి, జిల్లా అధ్యక్షుడు రామాంజినేయులు, నాయకులు ఓబులేసు, పోతులయ్య, వెంకటరమణ, రమణ, బానుకోట రామాంజినేయులు, గోపాల్, సహకార సంఘాల నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి ప్రతిబింబించేలా 'కాఫీ టేబుల్ బుక్'

జిల్లాలో చారిత్రాత్మక సంస్కృతి ప్రతిబింబించేలా ప్రత్యేకంగా 'కాఫీ టేబుల్ బుక్' రూపొందించాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా టూరిజం కౌన్సిల్ (డీటీసీ) సమావేశం నిర్వహించారు. అధికారులు, ఇంటాక్ సభ్యులు, కన్సల్టెన్సీ ప్రతినిధులతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చారిత్రక కట్టడాలు, సందర్శన స్థలాలు, వ్యవసాయం, పంటలు, పర్యాటకం, దేవాలయాలు, ప్రాచీన చెరువులు, హస్తకళలు, సంప్రదాయ వంటలు, సంస్కృతి సమాచారం సేకరించాలన్నారు. కన్సల్టెన్సీ ప్రతినిధులతో సమన్వయం చేసుకుని సమగ్ర 'కాఫీ టేబుల్ బుక్'ను రూపొందించి, సందర్శకులకు అందుబాటులో ఉండేలా ఇన్‌స్టిట్యూట్లు, విశ్వవిద్యాలయాలు, ప్రాంగణాల్లో ఉంచాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, పురావస్తు శాఖ ఏడీ రజిత, పర్యాటక శాఖ అధికారి జయకుమార్, దేవదాయశాఖ అధికారి ఆదిశేషునాయుడు, ఇంటాక్ కన్వీనర్ రామ్‌కుమార్, ఇతర అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏపీ సీడ్స్‌కు 'చంద్ర'గ్రహణం

- బకాయిలు చెల్లించకుండా మొండికేసిన వైనం
- ఇటీవల రూ.100 కోట్లు ఇచ్చినట్లే ఇచ్చి, అకౌంట్లు ఫ్రీజ్
- ఖరీఫ్‌లో నాణ్యమైన విత్తన సరఫరాకు ఇబ్బందే

విత్తనం.. లెక్కలేనితనం



ఏపీ సీడ్స్ జిల్లా కార్యాలయం

అనంతపురం అగ్రికల్చర్: వ్యవసాయమే దండగని చెప్పే సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఇప్పుడు రైతులకు నాణ్యమైన విత్తనాలూ అందకుండా చేస్తోంది. ఏకంగా రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ (ఏపీ సీడ్స్)నే నిర్వీర్యం చేసే దిశగా సాగుతోంది. ఈ సంస్థకు బకాయిలను చెల్లించకపోవడమే కాకుండా, ఇచ్చిన నిధులనూ వాడుకోకుండా బ్యాంకు అకౌంట్లను ఫ్రీజ్ చేసినట్లు సమాచారం. కనీసం రైతులు చెల్లించిన నాన్ సబ్సిడీ సొమ్ము కూడా పూర్తిస్థాయిలో అందకుండా చేసినట్లు తెలుస్తోంది. దీంతో రోజురోజుకూ ఏపీ సీడ్స్ ఆర్థిక పరిస్థితి దిగజారుతోందని అధికారవర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వ చర్యలతో మరో మూడు నెలల్లో ప్రారంభమయ్యే ఖరీఫ్ సీజన్‌లో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందకుండాపోయే దుస్థితి నెలకొంది.

అలా ఇచ్చి.. ఇలా లాగేసుకుంటోంది..

గతేడాది (2024–25) ఖరీఫ్, రబీ సీజన్లలో ఏపీ సీడ్స్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 7,79,245 క్వింటాళ్ల వివిధ రకాల విత్తనాలు రాయితీతో పంపిణీ చేశారు. దానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రూ.261.09 కోట్లు బకాయి పడింది. ఇటీవల అందులో రూ.100 కోట్లు ఏపీ సీడ్స్ పీడీ అకౌంట్‌కు జమ చేస్తున్నట్లు జీఓ ఇచ్చారు. అయితే, సొమ్ము డ్రా చేసేలోపే రాష్ట్ర ప్రభుత్వం అకౌంట్‌ను ఫ్రీజ్ చేసినట్లు చెబుతున్నారు. ఇదే కాదు.. రాష్ట్రవ్యాప్తంగా ఏపీ సీడ్స్ జిల్లా అకౌంట్లు కూడా ఫ్రీజ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. నిధులు ఇస్తున్నట్లు బయట చెప్పుకోవడానికి తప్ప ఏపీ సీడ్స్‌కు పైసా అందించడం లేదు. గతంలో అంటే 2018–19లో అప్పటి చంద్రబాబు సర్కారు దిగిపోయే సమయంలో కూడా రాయితీ విత్తనాల పంపిణీకి సంబంధించి ఏపీ సీడ్స్‌కు రూ.171.99 కోట్ల బకాయి పెట్టింది. కూటమి సర్కారు ఇప్పుడూ అదే చేస్తోంది. ప్రభుత్వ నిర్వాకంతో ఏపీ సీడ్స్ రైతులను ప్రోత్సహించి, ఉత్పత్తి చేసిన సర్టిఫైడ్ సీడ్‌ను కొనలేదు. ఈ క్రమంలో రైతులు నాణ్యమైన సీడ్‌ను తక్కువ ధరకు బయటి సంస్థలు, వ్యక్తులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి తలెత్తుతుంది. మరోపక్క పంటలు పండించే రైతులు బయటి మార్కెట్లో నాసిరకం సీడ్ కొనుక్కోవాల్సి వస్తుంది. మొత్తంమీద అన్నదాతకు అన్యాయం జరుగుతుంది.

ఉమ్మడి 'అనంత' బకాయిలు రూ.94 కోట్లు

గతేడాది ఖరీఫ్, రబీకి సంబంధించి ఒక్క ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే ఏపీ సీడ్స్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూ.94 కోట్లు చెల్లించాల్సి ఉన్నా.. ఇప్పటివరకు పైసా విడుదల చేయలేదని ఆ శాఖ వర్గాలు చెబుతున్నాయి.దీనివల్ల రానున్న ఖరీఫ్‌లో రైతులకు నాణ్యమైన విత్తనం సరఫరా కాకపోవచ్చని అంటున్నారు. ఎందుకంటే ఏపీ సీడ్స్ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా 50 వేల క్వింటాళ్ల సర్టిఫైడ్ సీడ్ ఉత్పత్తికి రైతుల ద్వారా 3,500 ఎకరాల్లో వేరుశనగ, కంది పంటలను ప్రోత్సహించారు. బకాయిలు విడుదల చేయకపోవడంతో రైతుల నుంచి నాణ్యమైన విత్తనం సేకరించడం కష్టమంటున్నారు. ఇప్పుడీ విత్తనం పరుల పాలవుతుందని, చివరకు మిల్లర్లు, ప్రాసెసింగ్ ప్లాంట్ల ద్వారా నాసిరకం విత్తనం సరఫరా చేయాల్సి వస్తుందనే ఆందోళన నెలకొంది.

గత ప్రభుత్వంలో అవార్డులు..

గత ఐదేళ్ల వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఏపీ సీడ్స్‌కు ఎప్పటికప్పుడు నిధులు అందేవి. దీనివల్ల రైతు భరోసా కేంద్రాల (ఆర్బీకేలు) ద్వారా గ్రామ స్థాయిలోనే రైతులకు ఏపీ సీడ్స్ నాణ్యమైన విత్తనం సరఫరా చేసేది. దీంతో రైతులకు ఖర్చు తగ్గి, పంట దిగుబడి కూడా ఎక్కువ వచ్చేది. ఏపీ సీడ్స్ నిర్వహించిన కీలక పాత్రతో 2021–22, 2022–23లో జాతీయ అవార్డులు కూడా అందుకుంది. 2022లో ప్రతిష్టాత్మక 'స్కోచ్' అవార్డు కూడా దక్కించుకుంది.

హనుమద్వాహనంపై నృసింహుడు

కదిరి: ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లా వాసులే కాకుండా పొరుగున ఉన్న కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. గురువారం ఖాద్రీశుడు హనుమద్వాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. ఉత్సవాలకు ఉభయదారులుగా జొన్నా వీరయ్య, జొన్నా వీర శేషయ్య కుటుంబ సభ్యులు వ్యవహరించినట్లు ఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖాద్రీ లక్ష్మీనారసింహుడు శుక్రవారం (నేడు) గరుడ వాహనంపై తిరువీధుల్లో తన భక్తులకు దర్శనమివ్వనున్నారు. నృసింహస్వామిని ఇలవేల్పుగా కొలిచే భక్తులంతా బ్రహ్మగరుడ సేవ రోజునే 'కదిరి పున్నమి' పేరుతో పండుగ జరుపుకుంటారు.



◄ హనుమద్వాహనంపై ఊరేగుతున్న ఖాద్రీశుడు



స్వామివారి దర్శనానికి తరలివచ్చిన భక్తులు

పరీక్షలు ముగిశాయ్.. ఇక ఎంజాయ్



పరీక్ష ముగిసిన ఉత్సాహంలో విద్యార్థులు



స్వగ్రామాలకు వెళ్తూ...

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ఈనెల 1న ప్రారంభమైన ఇంటర్ మొదటి సంవత్సరం పబ్లిక్ పరీక్షలు గురువారంతో ముగిశాయి. చివరి రోజు జరిగిన కెమిస్ట్రీ పేపర్–1, కామర్స్ పేపర్–1, సోషియాలజీ పేపర్–1, ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్ పేపర్–1 పరీక్షలకు విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారు. మైనర్ సబ్జెక్టుల పరీక్షలు ఈనెల 17, 19న ఉంటాయి. ఇక.. చివరిరోజు పరీక్షకు 806 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్ విద్యార్థులు 24,159 మందికి గాను 23,489 మంది హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 1,878 మందికి గాను 1,742 మంది హాజరయ్యారు. ఇంటర్ పరీక్షల నిర్వహణ కమిటీ కన్వీనర్ వెంకటరమణ నాయక్ 4, కమిటీ సభ్యులు 5, సిట్టింగ్ స్క్వాడ్ సభ్యులు 10, ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు 14, కస్టోడియన్లు 11 పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.

సందడే సందడి

పరీక్షలు ముగిసిన అనంతరం విద్యార్థులు సందడి సందడి చేశారు. చాలారోజులుగా జిల్లా కేంద్రంలో అద్దె గదులు, రెసిడెన్షియల్ కళాశాలలు, హాస్టళ్లల్లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులు పరీక్షలు పూర్తవగానే కేంద్రాల వద్ద సంతోషంగా గడిపారు. ఒకరికొకరు సెండాఫ్ చెప్పుకున్నారు. లగేజీలతో సొంతూళ్లకు వెళ్లారు. చాలామంది తల్లిదండ్రులు పిల్లలను తమ వెంట పిలుచుకెళ్లారు. ఆర్టీసీ బస్టాండు కిటకిటలాడింది.

క్లుప్తంగా

పట్టపగలే ఇంట్లో చోరీ

తాడిపత్రి: సజ్జలదిన్నె గ్రామంలో చాంద్‌బాషా అనే వ్యక్తి ఇంటిలో గురువారం పట్టపగలే చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. చాంద్‌బాషా, బీబీ దంపతులు సజ్జలదిన్నె పారిశ్రామిక వాడలోని ఓ బండల పాలిష్ పరిశ్రమలో కూలీలుగా పని చేస్తున్నారు. ఉదయం వారు పనులకు వెళ్లారు. ఇదే అదనుగా భావించిన గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో ఉన్న 2 తులాల బంగారు ఆభరణాలు, జత వెండి గొలుసులు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వివాహిత ఆత్మహత్య.. భర్తకు మూడేళ్ల జైలు

అనంతపురం: ఆత్మహత్యకు ప్రేరేపించేలా వ్యవహరించడమూ నేరమేనని అనంతపురం మహిళా ,అదనపు సెషన్స్ కోర్టు అభిప్రాయపడింది. వివాహిత ఆత్మకేసులో భర్తకు మూడేళ్లు జైలు శిక్ష, జరిమానా విధించింది. వివరాలు..అనంతపురం జిల్లా ఆత్మకూరు మండలం, మదిగుబ్బ గ్రామానికి చెందిన జింకల పోతన్నకు, పెనుకొండ మండలం గుట్టూరు గ్రామానికి చెందిన అనూషతో వివాహమైంది. పెళ్లి సమయంలో 15 తులాల బంగారం, రూ.లక్ష కానుకగా ఇచ్చారు. ఏడాది పాటు అన్యోన్యంగా ఉన్నారు. వేరొక మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని భార్యను శారీరకంగా, మానసికంగా వేధించాడు. ఆమె భరించలేక ఫిబ్రవరి 7, 2018న భర్త ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అప్పటి ఆత్మకూరు ఎస్‌ఐ సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. డీఎస్పీ వెంకట్రావు దర్యాప్తు చేసి మహిళా కోర్టు, నాలుగో అదనపు సెషన్స్ జడ్జి కోర్టులో కేసు దాఖలు చేశారు. జడ్జి శోభారాణి గురువారం 11 మంది సాక్షులను విచారించారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన అనంతరం నిందితుడు జింకల పోతన్నకు మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. బాధితుల తరుపున సుజన వాదించారు. కోర్టు మానిటరింగ్ సిస్టమ్ వెంకటేశ్, కోర్టు లైజన్ ఆఫీసర్ శ్రీనివాసులు, ఆత్మకూరు పీసీలు షేక్షావలి సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపరిచి నిందితులకు శిక్ష పడేలా కృషి చేశారు.

ఆరుగురిపై సస్పెన్షన్ వేటు

రాయదుర్గం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆరుగురిని సస్పెండ్ చేశారు. ఈ మేరకు గురువారం కేంద్ర పార్టీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. డీ హీరేహాళ్ మాజీ మండల కన్వీనర్ ఎం.వన్నూరుస్వామి, జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు గొడిశెలపల్లి రాళ్ల తిమ్మారెడ్డి, రాయదుర్గం మున్సిపల్ వైస్ చైర్మన్లు వలీబాష (5వ వార్డు), శ్రీనివాస్‌యాదవ్ (14వ వార్డు), కౌన్సిలర్లు డిష్ గోవిందు (21వ వార్డు), శ్రీనివాసరెడ్డి (4వ వార్డు)ని సస్పెండ్ చేశారు. వీరు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో క్రమశిక్షణ కమిటీ సిఫార్సుల మేరకు పార్టీ అధ్యక్షుడు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ ఆరుగురితో పార్టీకి సంబంధం ఉండదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సిబ్బందికే ఉపాధి హామీ

- ఫీల్డ్ అసిస్టెంట్ల కూలీల అవతారం
- వేతనం తీసుకుంటూనే కూలీలుగా అదనపు బిల్లులు
- వారి పేర్ల మీదే సింగిల్ జాబ్ కార్డుల సృష్టి



ఫిబ్రవరి నెలలో కన్నేపల్లి ఫీల్డ్ అసిస్టెంట్ గొల్ల నాగరాజు స్టాఫ్ శాలరీ స్టేటస్



కళ్యాణదుర్గం: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 'ఉపాధి' హామీ పథకంతో సంపద సృష్టించుకునేందుకు తెలుగు తమ్ముళ్లు పోటీ పడ్డారు. గతంలో పనిచేసిన ఫీల్డ్ అసిస్టెంట్లను బలవంతంగా తొలగించి, తమ పార్టీకి చెందిన కార్యకర్తలకు ఆ బాధ్యతలను అప్పగించారు. తద్వారా నిరుపేద కూలీలకు దక్కాల్సిన నిధులను అప్పనంగా స్వాహా చేసేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ ఫీల్డ్ అసిస్టెంట్ల మొదలు మండల స్థాయి నేతల వరకు ఈ అక్రమాలు ఊపందుకున్నాయి. ఒక్కొక్కటిగా అక్రమాలు వెలుగు చూస్తుండడంతో ఉపాధి కూలీలు నివ్వెర పోతున్నారు.

తారస్థాయికి చేరుకున్న అక్రమాలు

బ్రహ్మసముద్రం మండలం కన్నేపల్లి, పాల వెంకటాపురం, ఎస్. కొండాపురం గ్రామాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లు ఉపాధి కూలీల అవతారమెత్తారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి కుటుంబ సభ్యులకు ఉపాధి హామీ పథకంలో సింగిల్ జాబ్ కార్డులను సృష్టించి పేదల సొమ్మును దోచేసుకుంటున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లుగా ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న వారికి ప్రభుత్వం తరపున ప్రతి నెలా స్టాఫ్ శాలరీ కింద రూ.12,250 వరకు వేతనం అందుతుంది. అంతటితో ఆగకుండా కుటుంబ సభ్యుల పేరుతో సింగిల్ జాబ్ కార్డులు సృష్టించి అప్పనంగా ఉపాధి నిధులను దోచేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా తమ పేరుతోనే కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు జాబ్ కార్డులు సృష్టించుకుని పనులు చేయకుండానే చేసినట్లుగా రికార్డులు చూపిస్తూ నిధులను బ్యాంక్ ఖాతాలకు మళ్లించుకుంటున్నారు. తారస్థాయికి చేరుకున్న ఫీల్డ్ అసిస్టెంట్ల అక్రమాలు వెలుగు చూస్తున్నా... వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు.

మచ్చుకు కొన్ని...

- బ్రహ్మసముద్రం మండలం కన్నేపల్లి పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ గొల్ల నాగరాజు ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలలకు సంబంధించి నెలకు రూ.9,750 చొప్పున వేతనం అందిపుచ్చుకున్నారు. అయినా తన భార్య గొల్ల లక్ష్మీదేవి పేరుతో సింగిల్ జాబ్ కార్డు (ఏపీ-12-020-001-001/404231) సృష్టించాడు. ఆమె పేరున బ్యాంక్ ఖాతాకు గత ఏడాది డిసెంబర్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 24వ తేదీ వరకూ రూ.10,402 బిల్లులు చేసుకున్నాడు.
- గొల్ల సన్నయ్య పేరుతో ఉన్న జాబ్ కార్డు నంబర్ (ఏపీ-12-020-001-001/010021)లో ఫీల్డ్ అసిస్టెంట్ గొల్ల నాగరాజు ఉపాధి కూలీగా తన పేరును నమోదు చేసుకున్నాడు. గత ఏడాది 9వ నెల నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 24వ తేదీ వరకు రూ.22,272 బిల్లులు తన ఖాతాకు మళ్లించుకున్నాడు.
- పాల వెంకటాపురం గ్రామ పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ గొల్ల రామచంద్ర అతని పేరు మీద సింగిల్ జాబ్ కార్డు (ఏపీ-12-020-015-012-80814) సృష్టించుకున్నాడు. ఇతను కూడా కూలీ పనులు చేసినట్లుగా మస్టర్లు సిద్ధం చేసి గత ఏడాది 9వ నెల నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 10వ తేదీ వరకు రూ.13,861 బిల్లులు చేసుకున్నాడు.
- ఫీల్డ్ అసిస్టెంట్ గొల్ల రామచంద్ర తన భార్య జి.సునీత పేరుతో సింగిల్ జాబ్ కార్డు (ఏపీ-12-020-015-012-80813)ను సృష్టించి, గత ఏడాది జూన్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 2వ తేదీ వరకు రూ.19,505 నగదును ఆమె ఖాతాకు మళ్లించాడు.
- ఎస్.కొండాపురం గ్రామ పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ శివమణి తన తల్లి బి.లక్ష్మీదేవి పేరుతో డ్రైల్యాండ్ హార్టీకల్చర్ పథకం కింద 8 ఏళ్ల క్రితం మామిడి మొక్కలను నాటారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆమెకు సింగిల్ జాబ్ కార్డు సృష్టించి అప్పట్లో నాటిన మొక్కలకు ఈ ఏడాది ఫిబ్రవరి 3న మెటీరియల్ బిల్లు అంటూ రూ.15,303 నగదును ఖాతాకు మళ్లించుకున్నారు.

మామూళ్ల మత్తులో ఉపాధి అధికారులు

ఉపాధి హామీ పథకం అమలులో భాగంగా క్షేత్రస్థాయిలో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలు చోటు చేసుకుంటున్నా.. అధికారులు ఏ మాత్రం చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తాయి. ఫీల్డ్ అసిస్టెంట్లు ఓ వైపు ప్రభుత్వ వేతనం తీసుకుంటూనే మరోవైపు ఉపాధి కూలీలుగా అవతారమెత్తి వేతనాలను దక్కించుకుంటున్నారు. బిల్లులు చేయించుకునేందుకు ఉపాధి కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ మొదలు ఈసీ, టెక్నికల్ అసిస్టెంట్, ఈసీ, ఎంపీడీఓ స్థాయి వరకూ మామూళ్లు ముట్టజెబుతున్నట్లు సమాచారం.


విచారించి చర్యలు తీసుకుంటాం

ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రభుత్వం తరపున వేతనం చెల్లిస్తున్నాం. ప్రత్యేకంగా వీరు జాబ్‌కార్డులు కలిగి ఉండకూడదు. అలాగే భార్య, భర్తలకు సంబంధించి సింగిల్ జాబ్‌కార్డులు జారీ చేయకూడదు. అలా జరిగి ఉంటే విచారించి, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటాం.

– నంద కిషోర్, ఎంపీడీఓ, బ్రహ్మసముద్రం



ఫీల్డ్ అసిస్టెంట్ గొల్ల నాగరాజు భార్య గొల్ల లక్ష్మీదేవి పేరుతో సృష్టించిన సింగిల్ జాబ్ కార్డు



ఫీల్డ్ అసిస్టెంట్ రామచంద్ర భార్య జి.సునీత పేరుతో ఉన్న సింగిల్ జాబ్ కార్డు

జర్మనీ భాషపై శిక్షణ, ఉద్యోగావకాశాలు



అనంతపురం: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో జర్మనీ భాషపై శిక్షణతో పాటు ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పీవీ ప్రతాప్ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన మేరకు.. మెకట్రానిక్స్, ఎలక్ట్రికల్, ఎనర్జీ సిస్టమ్, ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు జర్మనీలో ఉద్యోగావకాశాలు దక్కుతాయి. మెకట్రానిక్స్, ఎలక్ట్రికల్, ఎనర్జీ సిస్టమ్, ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ లేదా డిప్లొమో పూర్తి చేసిన వారై 18 నుండి 40 సంవత్సరాల్లోపు వయస్సు కలిగివారై ఉండాలి. కనీసం మూడు సంవత్సరాల అనుభవం ఉండాలి. రోజుకు 8 గంటలు చొప్పున వారానికి 40 గంటలు పనిచేయాలి. రెండు సంవత్సరాల కాంట్రాక్టు కింద ఉద్యోగాలు కల్పిస్తారు. నెలకు ఇండియన్ కరెన్సీలో సుమారు రూ.2.52 లక్షల నుంచి రూ.3.28 లక్షలు చెల్లిస్తారు. వీసా, విమాన చార్జీలు భరించాల్సి ఉంటుంది. రూ.30 వేలు డాక్యుమెంటేషన్ చార్జీలు, రూ.40 వేలు డిపాజిట్ చేయాలి. జర్మనీకి వెళ్లిన అనంతరం తిరిగి ఆ నగదు ఇస్తారు. ఏ-2 స్థాయి వరకు ఆంధ్రప్రదేశ్‌లో ఆఫ్‌లైన్ శిక్షణ, బీ-1 స్థాయిలో ఇతర రాష్ట్రంలో ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ శిక్షణ కల్పిస్తారు. పాస్‌పోర్టు, స్కూల్ లీవింగ్ సర్టిఫికెట్, డిప్లొమో/ డిగ్రీ సర్టిఫికెట్, ఉద్యోగ అనుభవ సర్టిఫికెట్, లైట్ లేదా హెవీ వాహన డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి. ఈ నెల 25లోపు దరఖాస్తు చేయడానికి గడువుగా నిర్దేశించారు. skillinternational@apssdc.inలో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఏమైనా సందేహాలు ఉంటే 99888853335, 871265586, 8790118349 నంబర్లకు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చు.

తాడిపత్రిలో విధ్వంసకాండ



గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన గాజు వాకిలి, స్విచ్ బోర్డు

తాడిపత్రి టౌన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తాడిపత్రిలో విధ్వంసకాండ ఆగడం లేదు. తాజాగా గుర్తుతెలియని వ్యక్తులు చిన్నపోలమడ గ్రామ సమీపంలో ఉన్న ఆర్టీఓ కార్యాలయ భవనంలోకి చొరబడి భవన సామగ్రి, శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చొరవతో దాదాపు రూ.కోటి వెచ్చించి దాతల సహకారంతో భవనం నిర్మించారు. కార్యాలయం నిర్మాణంలో ఉండగానే ఆర్టీఓ అధికారులు వాహనాల ఎఫ్‌సీలు వంటి విధులు నిర్వర్తించేవారు. కార్యాలయ ప్రారంభాన్ని అడ్డుకునేందుకు తాడిపత్రి టీడీపీ నాయకులు విశ్వయత్నాలు చేశారు. అయితే అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో తాడిపత్రి మోటర్‌వెహికల్ ఇన్‌స్పెక్టర్లతో కలిసి అప్పటి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అధికారులు కార్యాలయం వైపు చూడటం మానేశారు. దీంతో భవనం కాస్త నిరుపయోగంగా మారింది.

సామగ్రి ధ్వంసం..

బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు కార్యాలయంలోకి చొరబడి కనబడిన వాటినల్లా ధ్వంసం చేశారు. భవనం ప్రారంభ శిలాఫలకాలు, తలుపులు, గాజు వాకిలి, విద్యుత్ బోర్డులు పగులగొట్టారు. అయితే ఇది గంజాయి మూకల పనా.. లేక గత ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను జీర్ణించుకోలేని అధికార పార్టీ నాయకుల పనా అంటూ పట్టణంలో చర్చ సాగుతోంది. ఈ విషయమై మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులును వివరణ కోరగా గత ప్రభుత్వంలో అప్పటి తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆదేశాలతో భవనం ప్రారంభోత్సవం అయితే జరిగిందని, ఆ భవనంలో విధులు నిర్వహించేందుకు ప్రభుత్వానికి నివేదికలు పంపినా పైనుంచి అనుమతులు రాలేదన్నారు. ప్రస్తుతం భవనం తమ పర్యవేక్షణలో లేదని, ధ్వంసం విషయం తమకు సంబంధం లేదని చెప్పుకొచ్చారు.

రూ.46 లక్షల విత్తనాలకు స్టాప్‌సేల్స్

- వ్యవసాయశాఖ ఏడీ ఎం.రవి, ఏఓ జే.శశికళ
- ఆత్మహత్యకు యత్నించిన రైతుకు పరామర్శ



ప్రభుత్వాసుపత్రిలో రైతు మురళిని పరామర్శిస్తున్న వ్యవసాయశాఖ ఏడీ రవి



కళింగర పంటను పరిశీలిస్తున్న హెచ్ఓ అమరేశ్వరి, ఏఓ ఓబిరెడ్డి

అనంతపురం అగ్రికల్చర్: నాసిరకం కలింగర విత్తనాల వల్ల నష్టం వాటిల్లిందని బుధవారం స్థానిక శ్రావణి సీడ్స్ దుకాణం ఎదుట పురుగుల మందు సేవించి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన బత్తలపల్లి మండలం డి.చెర్లోపల్లి రైతు మురళీ ఆరోగ్యం నిలకడగా ఉంది. గురువారం వ్యవసాయశాఖ ఏడీ ఎం.రవి, ఏవో జే.శశికళ స్థానిక ప్రభుత్వాసుపత్రికి వెళ్లి రైతును పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విత్తనం, పంట పెట్టుబడికి రూ.6.90 లక్షల వరకు ఖర్చు చేసినట్లు రైతు తెలిపారన్నారు. అందుకు సంబంధించి బిల్లులు సేకరించామన్నారు. బీఏఎస్ఎఫ్ కంపెనీకి చెందిన కళింగర విత్తనాలకు సంబంధించి వివిధ దుకాణాల్లో సోదాలు నిర్వహించి రూ.20 లక్షల విలువ చేసే విత్తనాలకు అమ్మకాల నిలిపివేత (స్టాప్‌సేల్స్) ఉత్తర్వులు ఇచ్చామన్నారు. అలాగే సాయంత్రం శ్రావణి సీడ్స్ దుకాణంను తెరపించి తనిఖీ చేశామన్నారు. స్టాకు, సేల్స్ మధ్య వ్యత్యాసాలు ఉన్నాయన్నారు. బీఏఎస్ఎఫ్‌తో పాటు మరికొన్ని కంపెనీలకు చెందిన రూ.26 లక్షలు విలువ చేసే కళింగర, కర్బూజా విత్తనాలకు స్టాప్ సేల్స్ ఉత్తర్వులు ఇచ్చామని తెలిపారు. మొత్తంగా రూ.46 లక్షల విలువ చేసే విత్తనాల అమ్మకాలు నిలిపివేశామన్నారు. కమిషనరేట్, జేడీఏ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. నకిలీ, నాసిరకం, నిషేధిత విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల అమ్మకాలపై నిఘా మరింత పెంచుతామని తెలిపారు.

కళింగర పంట పరిశీలన

బత్తలపల్లి: నకిలీ విత్తనాలతో మోసపోయి ఆత్మహత్యకు యత్నించిన గుజ్జల మురళి సాగు చేసిన కళింగర పంటను హార్టికల్చర్ అధికారిణి అమరేశ్వరి, ఏఓ ఓబిరెడ్డి గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా అధికారులు డి.చెర్లోపల్లిలో పంట సాగు, పెట్టుబడి వివరాలను సర్పంచు గుజ్జల రమాదేవి, ఇతర రైతులతో అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ మురళి 3.74 ఎకరాల్లో కళింగర పంట 'మాక్స్' రకంను నవంబర్ 27న నాటారన్నారు. పంట కాల పరిమితి 70-75 రోజులు దాటినా కాయ లోపల తెలుపు రంగులో ఉండడంతో వ్యాపారస్తులు ఎవ్వరూ కొనుగోలు చేయడానికి ముందుకు రాలేదు. నకిలీ విత్తనాలు అంటగట్టడం వల్లనే ఇలా జరిగిందని, తద్వారా పంటకు పెట్టిన పెట్టుబడులు కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదని రైతు ఆత్మహత్యకు యత్నించినట్లు తెలిపారు. ప్రాథమిక నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని వారు పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో డీటీసీ వీర్రాజు

అనంతపురం అర్బన్: రవాణా సంబంధిత సమస్యలు పరిష్కరిస్తామని కలెక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన ఆకాశవాణి కేంద్రం నుంచి 'అనంతమిత్ర ఫోన్‌ఇన్' కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 17 మంది ఫోన్ ద్వారా సమస్యలను విన్నవించారు. కార్యక్రమంలో డీటీసీ వీర్రాజు, ఆల్‌ఇండియా రేడియో ప్రోగ్రాం డైరెక్టర్ నాగేశ్వరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని...

ఫిర్యాదుదారు: నా పేరు వెంటరాముడు. మాది గార్లదిన్నె మండలం కోటంక గ్రామం, అనంతపురం నుంచి మా గ్రామానికి 2014లో రెండు బస్సులు తిరిగేవి. ప్రస్తుతం విద్యార్థుల కోసం ఉదయం, సాయంత్రం మాత్రమే తిప్పుతున్నారు. పురుషులు దాదాపు 20 కిలోమీటర్లు బైకులో వెళుతున్నారు. మహిళలు చాలా ఇబ్బంది పడుతున్నారు. గ్రామానికి అదనపు ట్రిప్పులు నడిపేలా చర్యలు తీసుకోండి.

కలెక్టర్: ఆర్టీసీ అధికారులు మీ ప్రాంతాన్ని పరిశీలిస్తారు. అవసరమైతే మరో బస్సును గ్రామానికి నడిపేలా చర్యలు తీసుకుంటారు.

ఫిర్యాదుదారు: నా పేరు బాబు. అనంతపురం రూరల్ మండలం ఆకుతోటపల్లి. ఇంటెల్ కళాశాల రోడ్డులో పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయి. ఈ రోడ్డు దాటుకోవడానికి విద్యార్థులు చాలా ఇబ్బంది పడుతున్నారు. డివైడర్లు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తే సౌకర్యంగా ఉంటుంది.

కలెక్టర్: మీరు చెబుతున్న ప్రదేశాన్ని రవాణా, పోలీసు శాఖల అధికారులు పరిశీలిస్తారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు.

ఫిర్యాదుదారు: నా పేరు మహబూబ్‌బాషా. మాది గార్లదిన్నె. చిన్న పిల్లలు వాహనాలు నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. హెల్మెట్ లేకుండా వాహనాలను నడపుతున్న వారికి పోలీసులు ఫైన్ వేస్తూ 'మీ సేవ'లో కట్టాలని చెబుతున్నారు. అక్కడి వెళితే ఫైన్‌తో పాటు అదనంగా రూ.30 కట్టాల్సి వస్తోంది. అలా కాకుండా ఒక యాప్ ఉన్నట్లయితే దాని నుంచి ఫైన్ కడితే రూ.30 మిగులుతాయి. ఈ సౌకర్యాన్ని కల్పించాలి.

కలెక్టర్: ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వడం నేరం. మైనర్లు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇప్పిస్తాం. యాప్ ద్వారా ఫైన్ కట్టే సౌలభ్యం కల్పించే అంశాన్ని పరిశీలించాలని సంబంధిత అధికారులను ఆదేశిస్తా.

తాగునీటి ఎద్దడి తలెత్తకూడదు

'వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకూడదు. మరమ్మతు పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టాలి' అని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో శ్రీ సత్యసాయి నీటి సరఫరా ప్రాజెక్టు బోర్డు కమిటీ సమావేశాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ బోయగిరిజమ్మతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తుగా పైప్‌లైన్ల ఏర్పాటు, దెబ్బతిన్న పైప్‌లైన్ల మరమ్మతు పనులు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్, సీఈఓ రామచంద్రారెడ్డి, ఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ శేషాద్రిశేఖర్, హెచ్ఎల్‌సీ ఎస్ఈ రాజశేఖర్, డీపీఓ నాగరాజునాయుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మద్యం.. మరణ శాసనం



కుటుంబాల్లో చిచ్చుపెట్టడంతో పాటు ఎందరినో బలితీసుకుంటున్న మద్యం మహమ్మారికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముకుతాడు వేయగా.. కూటమి సర్కార్ వచ్చీ రావడంతోనే మద్యం అమ్మకాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించింది. ఊరూరా బెల్టుషాపులతో మద్యాన్ని ఏరులైపారిస్తోంది. ఎప్పుడు కావాలంటే అప్పుడు అందుబాటులోకి తెచ్చింది. ఫలితంగా మందుబాబులు నిత్యం మత్తులోనే తూగుతున్నారు. తక్కువ ధరకే దొరికే చీప్ సరుకు ఒక్కోసారి ప్రాణాలే తీస్తోంది. ఈ క్రమంలోనే సుమారు 55 నుంచి 60 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి గురువారం మద్యంమత్తులో ఇలా అనంతపురం ఆర్టీసీ బస్టాండు మరుగుదొడ్ల వద్ద ప్రాణాలు వదిలాడు. మృతదేహాన్ని ప్రభుత్వ సర్వజనాసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు త్రీ టౌన్ సీఐ శాంతిలాల్ తెలిపారు. బంధువులు ఎవరైనా మృతదేహాన్ని గుర్తుపడితే సమాచారం ఇవ్వాలని కోరారు.

– అనంతపురం

హోలీ.. రంగుల కేళి!

- రంగుల ఎంపికలో జాగ్రత్తలు తప్పనిసరి
- ఆనందంతో పాటూ ఆరోగ్యమూ ముఖ్యమే

సందర్భం
నేడు హోలీ పర్వదినం





అనంతపురంలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న రంగులు, వాటర్ గన్స్

అనంతపురం కల్చరల్ : పేద, ధనిక తారతమ్యాలన్నింటినీ రంగుల్లో కడిగేసే మధుర క్షణాలు హోలీ రూపంలో వచ్చేశాయి. రోజూ ఎన్నో ఒత్తిళ్లు, ఉరుకులు పరుగులతో కాలం గడచిపోతుంటే కాస్తంత ఉపశమనానికన్నట్లు సప్తవర్ణాల శోభను అద్దుకునేందుకు రంగుల కేళీ హోలీ శుక్రవారం సందడి చేయనుంది. పౌరాణిక గాథలు, చారిత్రక కథనాలతో కూడా హోలీకి తరతరాల బంధం ఉంది. సహజంగా అన్ని వర్గాల వారు ఎంతో ఇష్టపడే హోలీ జిల్లాలో అధిక శాతం స్థిరపడిన ఉత్తరాదివారు మరింత ఆనందోత్సాహాల నడుమ జరుపుకుంటారు. ఆనందాల హోలీ విషాదాల కేళీ కాకుండా ఉండేందుకు సహజసిద్ధమైన రంగులను మాత్రమే వినియోగించాలని వైద్యులంటున్నారు.

సహజరంగులే ముద్దు

సాధారణంగా హోలీ ఆడిన తర్వాత చాలా మందిని ఇబ్బంది పెట్టేది చర్మసమస్యలు. ఇందుకు కారణం రంగుల్లో ఎక్కువ మోతాదులో రసాయన పదార్థాలుండడమే. ఈ తరహా రంగులు చర్మానికి హాని స్తాయనడంలో సందేహం లేదు. పొరపాటున కళ్లలో పడితే మరింత ప్రమాదంగా మారే అవకాశం ఉంటుంది. కాబట్టే రంగుల ఎంపికలో జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని వైద్యులు చెబుతున్నారు. వీలైనంత వరకు రసాయనాలకు బదులుగా సహజసిద్ధంగా ఇంటి వద్దనే తయారు చేసుకునే రంగులను హోలీ కోసం ఎంచుకోవాలని సూచిస్తున్నారు. దానికి తోడు వేసవి వచ్చేయడంతో నీటి ఇబ్బంది మరో రూపంలో సమస్యను తెచ్చిపెడుతుంది. విపరీతంగా నీళ్లను వృథా చేయడం కూడా మంచిది కాదని అందరూ చెప్పే మాట.

ఈ సూచనలు పాటిస్తే మేలు

- చవకగా దొరుకుతాయని రసాయనాలు కలిపిన రంగులతో హోలీ ఆడకుండా ఉండడం.
- ఎక్కువగా ఎరుపు, పింక్ రంగులనే వాడితే మంచిది. ఎందుకంటే ఇవి తక్కువ గాఢత కలిగి ఉండడం వల్ల శరీరంపై నుంచి సులభంగా తొలిగిపోతాయి.
- హోలీ ఆడడానికి ముందు ముఖానికి మాయిశ్చరైజర్, తలకు నూనెను రాసుకోవాలి. వీటి వల్ల రంగులు శరీరంలో ఇంకవు. శుభ్రం చేయడం కూడా సులువవుతుంది.
- ముఖంపై పడిన రంగులను శుభ్రం చేసుకోవడానికి సబ్బు కన్నా క్లెన్సింగ్ మిల్క్ ఉత్తమమైనదని బ్యూటీషియన్స్ చెబుతారు.
- తక్కువ నీరుతో రంగులు పోవాలంటే మనం హోలీలో ఉపయోగించే రంగుల్లో ఎక్కువ మోతాదు ఆయిల్ వాడకం తగ్గించాలి. ఇంట్లో దొరికే పసుపు, కుంకుమ వంటివి ఎక్కువ హాని చేయవు.

క్లుప్తంగా

కలెక్టర్‌కు సన్మానం



కలెక్టర్ వినోద్‌కుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం అర్బన్: మొల్లమాంబ జయంతి కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు, కుమ్మర శాలివాహన ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమ్మర ఓబుళపతి, సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జేకే రామాంజినేయులు, నాయకులు లక్ష్మన్న, రామాంజినేయులు, రామకృష్ణ, రమణ, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి



మాట్లాడుతున్న హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటరమణ

రాప్తాడు: మైనర్లకు ఎవరైనా వివాహం చేస్తే కఠిన చర్యలు తప్పవు, బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటరమణ సూచించారు. మండలంలోని ధర్మవరం పంగల్ రోడ్డులోని కేజీబీవీ పాఠశాలలో 'బాల్య వివాహాలు– టీనేజ్ గర్భం వల్ల కలిగే నష్టాలు'పై అవగాహన కల్పించారు. వెంకటరమణ మాట్లాడుతూ ఎవరైనా బాలికను వివాహం చేసుకుని సంసారం చేస్తే వారిపై అత్యాచారం కేసుగా నమోదు చేసి పోక్సో సవరణ చట్టం–2019 సెక్షన్ 4(ఐ) ప్రకారం ఇరవై సంవత్సరాల కంటే తక్కువ కాకుండా జైలు శిక్ష, జరిమానా, జీవిత ఖైదు విధించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ అరుణమ్మ, ఆరోగ్య సహాయకులు నారాయణ స్వామి, ఏఎన్ఎం అనిత, ఎంఎల్‌హెచ్‌పీ లక్ష్మీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రోగుల సేవల్లో ఎల్‌టీల పాత్ర కీలకం

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబ దేవి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబ దేవి

అనంతపురం మెడికల్: రోగులకు సేవలందించడంలో ల్యాబ్ టెక్నీషియన్ల పాత్ర ఎంతో కీలకమని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి అభిప్రాయపడ్డారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో గురువారం జిల్లా ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మెడికల్ లేబొరేటరీ టెక్నీషియన్స్ డే నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ కేక్ కట్ చేసి సిబ్బందికి అందించారు. శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ల్యాబ్ టెక్నీషియన్స్‌ను జోనల్ కేడర్ పరిధిలోకి తీసుకురావాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులకు 100 శాతం వేతనాలు ఇవ్వాలని, యూపీహెచ్‌సీలో పని చేస్తున్న ఎన్‌హెచ్ఎం ఎల్‌టీలకు వేతనాలు పెంచాలన్నారు. ఎల్‌టీ అసోసియేషన్ నాయకులు వేణుగోపాల్, రవీంద్ర, శ్రీనివాస్ రెడ్డి, శరత్‌బాబు, శివకృష్ణ, సుదర్శన్ రెడ్డి, నాగరాజు, కరుణ, రవికిరణ్, శశికళ తదితరులు పాల్గొన్నారు.

మంచి ఉత్తీర్ణత సాధించాలి



స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేసిన దృశ్యం

రాప్తాడు: కష్టపడి చదివి పదో తరగతిలో మంచి ఉత్తీర్ణత సాధించి, పాఠశాల, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని గొందిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు సూచించారు. గురువారం మండలంలోని గొందిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు పూర్వ విద్యార్థులు మంజునాథ్, లోకేష్ స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కేశవయ్య, శివశంకర్, వీరేంద్ర, మనోజ్, మల్లికార్జున, మదన్ కుమార్, మురళి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ విగ్రహ ప్రతిష్ట



అలంకరణలో పెద్దమ్మ

ఆత్మకూరు: మండలంలోని సనప గ్రామంలో భక్తిశ్రద్ధలతో పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టను గురువారం నిర్వహించారు. మూడు రోజుల నుంచి పూజా కార్యక్రమాలను జరిపారు. గ్రామంలో మూడు చోట్ల బోడ్రాయి ఏర్పాటు చేసి పెద్దమ్మ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. విగ్రహ ప్రతిష్ట రోజు నుంచి 41 రోజుల తరువాత గ్రామంలో ఊరి దేవర నిర్వహిస్తామని గ్రామస్తులు తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు చెల్లించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

దగ్గుపాటి అబద్ధాల కోరు

- మాజీ ఎమ్మెల్యే అనంతను విమర్శించే అర్హత ఆయనకు లేదు
- నోరు అదుపులో పెట్టుకోకపోతే ఊరుకునేది లేదు
- మేయర్ వసీం ధ్వజం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అబద్ధాల కోరు అని మేయర్ వసీం ధ్వజమెత్తారు. కంపోస్టు యార్డులో అక్రమాలు జరిగాయంటూ అసెంబ్లీలో ఎమ్మెల్యే దగ్గుపాటి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ గురువారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మేయర్ వసీం మాట్లాడుతూ ఎమ్మెల్యేగా దగ్గుపాటి నగరానికి చేసింది సున్నా అని విమర్శించారు. నగరపాలక సంస్థ చరిత్రలో లేని విధంగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ.వెయ్యి కోట్ల అభివృద్ధి పనులు జరిగేలా చర్యలు తీసుకున్న అప్పటి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిపై బురదజల్లే ప్రయత్నం తప్ప దగ్గుపాటి చేసిందేమీ లేదన్నారు. ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకోకపోతే ప్రజాస్వామ్య పద్ధతిలో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. గత 40 ఏళ్లుగా గుత్తి రోడ్డులో 12.5 ఎకరాల్లో డంప్ యార్డు కొనసాగుతోందన్నారు. లక్షల టన్నుల చెత్త ఉండడంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి చొరవతో బయోమైనింగ్ పద్ధతి ద్వారా చెత్త నిర్వహణ చేపట్టేందుకు రూ.23 కోట్లు మంజూరయ్యాయన్నారు. అందుకు సంబంధించి వైఎస్సార్ సీపీ హయాంలో రూ.5.36 కోట్ల బిల్లులు చెల్లించగా, కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రూ.4.22 కోట్ల బిల్లులు చెల్లించారన్నారు.

దమ్ముంటే విచారణ జరిపించు..

కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక కౌన్సిల్‌లో కంపోస్టు యార్డుపై ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడితే.. విచారణ చేపట్టాక బిల్లులు చేయాలని తానే చెప్పినట్లు వసీం గుర్తు చేశారు. ఈ క్రమంలోనే సదరు ఏజెన్సీకి బిల్లులు చేయాలంటూ మీరు కాదా అధికారులకు సిఫార్సు చేసింది అని ఎమ్మెల్యేను ప్రశ్నించారు. అక్రమాలు జరిగి ఉంటే బిల్లులెందుకు చెల్లించాలని చెబుతున్నారో అసెంబ్లీ వేదికగానే ప్రజలకు వివరించాలన్నారు. దమ్ముంటే దీనిపై విచారణ చేయించాలని సవాల్ విసిరారు. సదరు ఏజెన్సీకి పూర్తి స్థాయిలో బిల్లులు చెల్లించలేదని, అయినా అవినీతి జరిగిందని, బిల్లులు ఇవ్వండంటూ రెండు మాటలు మాట్లాడటం వెనుక ఆంతర్యమేమిటో ఆయనే చెప్పాలన్నారు. దీనిపై విచారణ చేయించాలని తాము కలెక్టర్‌కు విన్నవించామన్నారు.

మచ్చలేని వ్యక్తి అనంత..

ప్రజా జీవితంలో ఎలాంటి మచ్చలేకుండా మాజీ ఎమ్మెల్యే 'అనంత' సేవలందిస్తున్నారని మేయర్ తెలిపారు. 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఏ విధమైన అవినీతి ఆరోపణలు లేని ఆయన గురించి ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడడం సరికాదన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.1,045 కోట్ల అభివృద్ధి జరగడంలో 'అనంత' పాత్ర ఎనలేనిదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై 9 నెలలు గడుస్తున్నా నగర పాలక సంస్థకు నిధులు తీసుకురాకపోగా, అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే దగ్గుపాటి పరోక్షంగా అడ్డు పడుతున్నారని ఆరోపించారు. రూ.15 కోట్ల అభివృద్ధి పనులకు టెండర్ పిలిస్తే ఒక్క పని చేయకుండా జాప్యం చేస్తున్నారన్నారు. దగ్గుపాటిని డమ్మీ ఎమ్మెల్యే అంటూ టీడీపీ నాయకులే విమర్శిస్తున్నారన్నారు. ఇప్పటికైనా చౌకబారు రాజకీయాలు మానుకోవాలని, లేని పక్షంలో ప్రజా క్షేత్రంలో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చింతకుంట మధు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మల్లెమీద నరసింహులు, మహిళా విభాగం నగర అధ్యక్షురాలు సాకే చంద్రలేఖ, కార్పొరేటర్లు రహంతుల్లా, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'పాస్టర్ల' సర్వసభ్య సమావేశం



పాస్టర్‌కు చెక్కు అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

రాప్తాడురూరల్: జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 57వ సర్వసభ్య సమావేశం గురువారం ఘనంగా నిర్వహించారు. అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి సమీపంలోని ఏసుకృపా మందిరంలో అసోసియేషన్ అధ్యక్షుడు పాస్టర్ రెడ్డి వారి నెహెమ్యా నాగరాజు ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ముందుగా దైవజనులందరితో అంశాల వారీగా ప్రార్థన విజ్ఞాపన జరిపించారు. ముఖ్య అతిథులుగా రెవ బెంజిమన్, పాస్టర్ మార్టిన్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఏసు ప్రభువు చూపిన మార్గంలో నడవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ పాస్టర్ వి. మనషే, పాస్టర్ బాబు, పాస్టర్ నవీన్ కుమార్, అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పాస్టర్ పీ మార్కు, సెక్రటరీ పాస్టర్ జి ఆర్ ఆనంద్, ట్రెజరర్ పాస్టర్ కె. జీవన్ బాబు, పాస్టర్ జహంగీర్ జాషువా, పాస్టర్ లాబాన్ సుధాకర్, పాస్టర్ విజయ్ సింహ, పాస్టర్ చార్లెస్ నాయక్ పాల్గొన్నారు.

ప్రజలకు హోలీ శుభాకాంక్షలు

అనంతపురం: జిల్లా ప్రజలందరికీ ఎస్పీ పి. జగదీష్ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. మత సామరస్యం పాటిస్తూ సంతోషకర వాతావరణంలో హోలీ పండుగ జరుపుకోవాలని సూచించారు. ఎవరి మనోభావాలూ దెబ్బతినేలా వ్యవహరించకుండా పండుగ చేసుకోవాలన్నారు. జిల్లాలోని ముఖ్యమైన పట్టణాలు, ప్రదేశాలు, కాలనీలు, రహదారులపై సీసీ కెమెరాలు ఉండటంతో పాటు డ్రోన్లు కూడా వినియోగిస్తున్నామని తెలియజేశారు. కించపరిచేలా, రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడం లేదా ఏవేని సమస్యలకు కారణమైతే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఇలాంటి పర్వదినాల సందర్భంగా ముఖ్యంగా యువత ఆదర్శంగా ఉండాలన్నారు. బైక్‌లపై వేగంగా, సైలెన్సర్లు తొలగించి పెద్ద శబ్దాలు చేసుకుంటూ వెళ్లరాదన్నారు. ఇతరులకు ఇబ్బంది కలగకుండా ఉత్సవం జరుపుకోవాలన్నారు. సంప్రదాయ పండుగలు ఏవైనా ప్రజలు కలిసిమెలిసి ప్రశాంత వాతావరణంలో ముందుకు సాగాలన్నారు. పండుగ వేళ ఎవరైనా గొడవలు పడినా, అసత్య ప్రచారం చేసినా, ఇతరుల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, మహిళలను వేధింపులకు గురిచేసినా కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి



జేడీఏ కార్యాలయ ఏఓకు వినతి పత్రం అందిస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

అనంతపురం అగ్రికల్చర్: నాసిరకం కళింగర విత్తనాలతో మోసపోయి ఆత్మహత్యాయత్నం చేసిన రైతు మురళి కుటుంబాన్ని ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం నాయకులు ఆర్.చంద్రశేఖర్ రెడ్డి, బీహెచ్ రాయుడు, తరిమెల నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బత్తలపల్లి మండలం డి.చెర్లోపల్లి గ్రామానికి చెందిన రైతు మురళిని పరామర్శించిన తర్వాత వ్యవసాయ శాఖ జేడీ కార్యాలయంలో టెక్నికల్ ఏఓ రాకేష్ నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. విత్తనాలు అమ్మిన శ్రావణి సీడ్స్ దుకాణం లైసెన్సు రద్దు చేయడంతో పాటు నష్టపరిహారం చెల్లించి రైతును ఆదుకోవాలన్నారు. రైతులు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడేవరకు రావడం దారుణమైన విషయమన్నారు. ఇలాంటి సంఘటనలు మళ్లీ చోటు చేసుకోకుండా నాసిరకం, కల్తీ సరుకును అరికట్టాలని వారు డిమాండ్ చేశారు.

సంక్షిప్త సమాచారం

ఉచిత టైలరింగ్ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

రాప్తాడు: ఉచితంగా టైలరింగ్ శిక్షణకు అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ విజయలక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, క్షత్రియ, వైశ్యా, బ్రహ్మణ, కాపు (బలిజ) కులాల మహిళలకు ఉచితంగా టైలరింగ్ శిక్షణ ఇచ్చి, శిక్షణ పూర్తయిన తర్వాత కుట్టు మిషన్ కూడా ఇస్తుందన్నారు. కుట్టు శిక్షణకు ఈ నెల 22వ తేదీలోపు సంబంధిత గ్రామ సచివాలయం, ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. టైలరింగ్ శిక్షణ కాలంలో 75 శాతం హాజరును ఎఫ్ఆర్ఎస్ యాప్ ద్వారా పరిగణలోకి తీసుకొని కుట్టు మిషన్ పంపిణీ చేస్తామన్నారు.

రామ్మోహన్‌కు ఏఈగా పదోన్నతి

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలో డ్రాఫ్ట్స్‌మెన్‌గా పని చేస్తున్న రామ్మోహన్‌కు ఏఈగా పదోన్నతి లభించింది. ఈ మేరకు గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రామ్మోహన్‌కు ఏఈగా పదోన్నతి రావడంతో సహచర సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఘనంగా నృసింహుని కల్యాణం

ఆత్మకూరు: పంపనూరు కొండపై వెలసిన మలహోబిల లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. మొదటగా హోమం, స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణోత్సవం జరిపించారు.

నిస్సహాయ మహిళను ఆదుకోవడం అభినందనీయం

అనంతపురం కల్చరల్: నిస్సహాయ మహిళకు స్వయం ఉపాధి శిక్షణనిచ్చి ఆదుకోవడం అభినందనీయమని 'మానవత' కన్వీనర్ తరిమెల అమరనాథరెడ్డి అన్నారు. రెయిన్‌బో హోమ్స్ ఆధ్వర్యంలో గురువారం ఒంటరి మహిళకు కుట్టుమిషన్ అందించారు. ఈ సందర్భంగా సీఆర్‌డీఎస్ కమ్యూనిటీ కేర్ అండ్ లర్నింగ్ సెంటర్‌లో జరిగిన సమావేశంలో సీనియర్ రచయిత మానవత తరిమెల అమరనాథ రెడ్డి, విశ్రాంత ప్రిన్సిపాల్ శశికళ, అడ్వొకేట్ దయానంద, సంస్థ అధ్యక్షుడు సద్దాం బాషా, షమీనా తదితరులు మాట్లాడారు. మిషన్‌తో పాటు నిత్యావసర వస్తువులు, బెడ్ షీట్లు, చిన్నారులకు దుస్తులు కూడా అందించామన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

అనంతపురం కల్చరల్: నగరంలోని ఆదిమూర్తినగర్ వేమనా టెలీఫోన్ భవన్ ఎదురుగా ఉన్న షిరిడిసాయిబాబా మందిరంలో సాయినాథుని విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. సుప్రభాత సేవలు, అభిషేకాలు, అలంకార సేవలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు జయచంద్ర చౌదరి మాట్లాడుతూ 24 ఏళ్ల క్రితం మందిరంలో విగ్రహాన్ని ప్రతిష్ఠించామని, షిరిడి క్షేత్రంలో బాబా రూపాన్ని మలచిన శిల్పుల వంశీకులే అనంతలోనూ చక్కటి రూపునివ్వడం విశేషమన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సెక్రటరీ నాగానందం, ట్రెజరర్ రాఘవేంద్ర గుప్తా, రవీంద్రనాథ్, భార్గవ సాయి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా కనకదాస గ్రామోత్సవం

రాప్తాడు: కురుబల ఆరాధ్య దైవం కనకదాస గ్రామోత్సవాన్ని గురువారం మండల కేంద్రంలో కురుబ కులస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గత ఏడాది మార్చి 13న కనకదాస విగ్రహ ప్రతిష్ట నిర్వహించగా.. గురువారం ప్రథమ వార్షికోత్సవాన్ని జరిపారు. ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై కనకదాస చిత్రపటాన్ని ఉంచి ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ అన్నదానం చేశారు.

భూ కబ్జా కేసులో ముగ్గురి అరెస్ట్

అనంతపురం: భూ కబ్జా కేసులో ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు త్రీ టౌన్ సీఐ కే శాంతిలాల్ తెలిపారు. గత నెల రెండో తేదీన రాత్రి గట్టు రామాంజనేయులు ఆధ్వర్యంలో అనంతపురం జిల్లా తాడిపత్రి టౌన్‌లో నివసిస్తున్న చదళ్ల సత్యనారాయణ రెడ్డికి చెందిన సర్వే నంబర్ 95/2ఏలోని 661/2 సెంట్ల భూమిలోకి అక్రమంగా ప్రవేశించి, ప్రహరీని ధ్వంసం చేసి తాత్కాలికంగా గుడిసెలను నిర్మించారు. దీనిపై బాధితుడు ఫిర్యాదు చేయగా, భూకబ్జా కింద కేసు నమోదు చేశారు. గురువారం గట్టు రామాంజనేయులు, నగరంలోని ముత్యాలమ్మ కాలనీకి చెందిన రామాంజినమ్మ అలియాస్ రమాదేవి, తాడిమర్రి మండలం పెద్దకోట్లకు చెందిన రాములమ్మ అలియాస్ లక్ష్మీని అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. ముగ్గురిని కోర్టులో హాజరుపరచగా, కోర్టు 14 రోజుల రిమాండ్ విధించిందని, మిగిలిన నిందితులను త్వరలో అరెస్ట్ చేస్తామన్నారు.

ఆక్రమణల తొలగింపు

అనంతపురం కార్పొరేషన్: సెంట్రల్ పార్క్‌లో అక్రమ నిర్మాణాలను టౌన్ ప్లానింగ్ అధికారులు గురువారం తొలగించారు. కమిషనర్ బాలస్వామి ఆదేశాలతో టీపీఎస్ మంజులమ్మ, సచివాలయ సిబ్బంది నిర్మాణాన్ని తొలగించారు. ఈ సందర్భంగా నిర్మాణదారుడు తనకు ఆత్మహత్యే శరణ్యమంటూ అడ్డుపడగా.. టౌన్ ప్లానింగ్ సిబ్బంది అతణ్ని పక్కకు పంపి, ఆక్రమణలు తొలగించారు.

అంతర్జాతీయ సదస్సులో ప్రతిభ

అనంతపురం: విజయవాడలో ఈ నెల 11నుంచి 12వ తేదీ వరకు 'లైఫ్ సైన్సెస్ రీసెర్చ్ ఆవిష్కరణలు' అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ఇందులో సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీకి చెందిన ఎమ్మెస్సీ మాలిక్యులర్ బయాలజీ విద్యార్థులు బోనం బ్లెస్సి, షేక్ అంజుమ్, గుత్తి అతియపిరోడస్, వై. లక్ష్మీనారాయణ, మాదాపురం అశ్విని, భూక్యా శివాని, పీవీ సాయి శ్రీ హర్ష పేపర్ ప్రజెంటేషన్ చేశారు. 'స్లీడింగ్ దశలో కరువు పరిస్థితుల్లో నిలబడి అధికంగా దిగుబడి ఇచ్చే క్యాప్సికమ్' అనే అంశంపై పేపర్ ప్రజెంటేషన్ చేశారు. మొదటి బహుమతి దక్కించుకున్నారు. ఈ సందర్భంగా సెంట్రల్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఎస్ఏ కోరి, రిజిస్ట్రార్ షీలా రెడ్డి విద్యార్థి బృందాన్ని, అధ్యాపకులను అభినందించారు.

రెక్కల కష్టం నేలపాలు



ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితులు

కదిరికి చెందిన మహిళారైతు ఆరుగాలం శ్రమించి వరి పండించింది. బియ్యం ఆడించాక అనంతపురంలోని తన కుటుంబీకులకు వాటిని అందజేసేందుకు గురువారం కదిరి నుంచి ఆర్టీసీ బస్సులో వచ్చింది. బస్సు బస్టాండుకు చేరుకోగానే బియ్యం దించుకుంటూ ఉండగా.. డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనాన్ని ముందుకు నడిపాడు. దీంతో బియ్యం మూట కిందపడి పగిలిపోయింది. రెక్కలకష్టం నేలపాలు కావడంతో ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. పొరపాటున బస్సుకింద తాము పడి ఉంటే పరిస్థితి ఏమిటంటూ వాపోయింది. అనంతరం మరోసంచి తీసుకునివచ్చి మండుటెండలోనే నేలపాలైన బియ్యాన్ని ఎత్తుకుంది. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



సంచిలోకి బియ్యం ఎత్తుతున్న దృశ్యం

అధికారం ఉందని దాడులు చేస్తారా?



కురుబ చిక్కాల బాలన్నను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయాల్సింది పోయి దాడులు చేస్తే ఎలా ? అని టీడీపీ నాయకులపై వైఎస్సార్‌సీపీ మండల నాయకులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బుధవారం రాత్రి మండలంలోని సిద్దరాంపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కురుబ చిక్కాల బాలన్నపై టీడీపీ నేతలు కర్రలతో దాడి చేసిన విషయం తెలిసిందే. గురువారం వైఎస్సార్‌సీపీ నాయకులు బాలన్నను పరామర్శించారు. అధైర్య పడొద్దని .. అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి భరోసా ఇచ్చినట్లు తెలిపారు. ఎప్పుడూ అధికారం ఒకటే పార్టీకి ఉండదన్న విషయాన్ని కూటమి నాయకులు గ్రహించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి దుబ్బ చంద్రశేఖర్‌రెడ్డి, కన్వీనర్ బాలపోతన్న, యూత్ కన్వీనర్ కొండారెడ్డి, వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్ నాయక్, నాయకులు వాసుదేవరెడ్డి, ఫణిరెడ్డి, బాబయ్య, ఇడుముడి గంగన్న, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి

అనంతపురం అర్బన్: ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఈనెల 15 నుంచి 20వ తేదీ వరకు ఉపాధి పనుల వద్దకు స్కూటర్ యాత్రలు నిర్వహించనున్నామన్నారు. గురువారం స్థానిక సంఘం కార్యాలయంలో సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ పెండింగ్ వేతనాలు చెల్లించాలన్నారు. పని ప్రదేశంలో కనీస సదుపాయాలు కల్పించాలన్నారు. పనిముట్లు, సమ్మర్ అలవెన్స్, మంచినీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. మేట్లకు పారితోషకం, ఇతర సమస్యల పరిష్కారం కోసం ఈనెల 20 నుంచి 24 వరకు గ్రామ సచివాలయల్లో వినతిపత్రాలు అందజేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఏప్రిల్ మొదటి వారంలో డ్వామా పీడీ కార్యాలయం, కలెక్టరేట్ వద్ద పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సూరి, ఉపాధ్యక్షులు భాస్కర్, కృష్ణ, నారాయణ, సభ్యులు పెద్దన్న, తేరి నాగప్ప, నాగలింగమయ్య పాల్గొన్నారు.

నిషేధిత ప్లాస్టిక్ విక్రయాలకు అడ్డుకట్ట

- రూ.56,000 జరిమానా



స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ బాలస్వామి

అనంతపురం కార్పొరేషన్: నిషేధిత ప్లాస్టిక్ విక్రయాలకు అడ్డుకట్ట వేసేందుకు నగరపాలక సంస్థ ప్రజారోగ్యాధికారులు ఉపక్రమించారు. గురువారం నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి ఆదేశాలతో నగరంలోని కమలానగర్ తదితర ప్రాంతాల్లో ఎంహెచ్‌ఓ డాక్టర్ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. కొన్ని షాపుల్లో టన్ను మేర నిషేధిత ప్లాస్టిక్‌ను సీజ్ చేశారు. స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్‌ను కమిషనర్ బాలస్వామి పరిశీలించారు. ప్లాస్టిక్ షాపుల యజమానులకు రూ.56,000 జరిమానా విధించినట్లు తెలిపారు. ప్లాస్టిక్ విక్రయాలు చేపడితే ఉపేక్షించేది లేదని పేర్కొన్నారు. సింగిల్ యూజ్, ఇతర నిషేధిత ప్లాస్టిక్ వాడకం పర్యావరణంతో పాటు ప్రజల ఆరోగ్యానికి ప్రమాదకరమన్నారు. నగర ప్రజలు ప్లాస్టిక్‌ను వాడకూడదన్నారు. జూట్ బ్యాగులు, ఇతర వస్తువులను వినియోగించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై భారం మోపడం సరికాదు



లేఖను విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, నాయకులు

అనంతపురం అర్బన్: సంస్కరణల పేరుతో కేంద్ర ప్రభుత్వ బలవంతపు ఎత్తుగడలకు రాష్ట్ర ప్రభుత్వం లొంగి ప్రజలపై భారం మోపడం సరికాదని ఏపీ యునైటెడ్ సిటిజన్స్ ఫోరం (ఏపీయూసీఎఫ్) నాయకులు పేర్కొన్నారు. ఆస్తిపన్నుకు సంబంధించిన జీఓ 198ని ఉపసంహరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు విన్నవించారు. ఈ మేరకు సీఎంకు రాసిన లేఖను గురువారం స్థానిక జేవీవీ కార్యాలయంలో విడుదల చేశారు. అనంతరం విలేకరులతో మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, సంఘం అధ్యక్ష, గౌరవాధ్యక్షుడు ఎస్ఏ రసూల్, ఎ.చంద్రశేఖర్ మాట్లాడారు. ఆస్తి పన్నును అద్దె విలువ ఆధారంగా కాకుండా మూలధన విలువకు మదింపు చేసే విధానాన్ని జీఓ 198 మార్చిందన్నారు. రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా అమలయ్యే ఆస్తి విలువ సవరణతోపాటు ప్రతి ఏడాది స్వయంచాలకంగా ఆస్తి పన్ను పెంచేందుకు అవకాశం కల్పిస్తుందన్నారు. అధికారంలోకి వస్తే ఆ జీఓను రీకాల్ చేస్తామని గతంలో చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. ఈ క్రమంలో హామీని గుర్తు చేస్తూ లేఖ పంపినా స్పందన లేదన్నారు. జీఓ ఉపసంహరించుకునేంత వరకూ నిరసనలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఏజీ రాజమోహన్, కార్యవర్గ సభ్యులు ఎంఎస్‌టీ రాజు, వన్నూరప్ప పాల్గొన్నారు.